ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

కాచిగూడ: తెలంగాణ రాష్ట్రం లోని మైనార్టీ గురుకుల జూనియర్ కళాశాలలు, పాఠశాలల్లో ఔట్ సోర్సింగ్ విధానం ద్వారా జూనియర్ లెక్చరర్స్, ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్ఎస్‌వీ ఎంటర్‌ప్రైజెస్ సంస్థ ప్రతినిధులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ లెక్చరర్స్ పోస్టులకు ఇంగ్లిష్, కెమిస్ట్రీ, ఎకనామిక్స్ టూరిజం అండ్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్, డిప్యూటీ వార్డెన్, డేటా ఎంట్రీ ఆపరేటర్స్, తదితర పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఈ పోస్టులకు జనవరి 4వ తేదీన ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి చేసిన దరఖాస్తులను నాంపల్లి హజ్‌భవన్‌లో అందజేయాలని కోరారు.

ఉద్యోగ విరమణ

నల్లకుంట: ఉద్యోగులకు పదవీ విరమణ ప్రతి ఉద్యోగి జీవితంలో ఒక భాగమని నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్. రాజేంద్రప్రసాద్ అన్నారు. ఫీవర్ ఆస్పత్రి నాల్గో తరగతి ఉద్యోగి(వాటర్ మెన్) మనోహర్ పదవీ విరమణ పొందారు. ఈ మేరకు మంగళవారం ఫీవర్ ఆస్పత్రి ఉద్యోగులతో కలిసి ఆయన మనోహర్‌ను సన్మానించారు. మనోహర్ ఆస్పత్రిలో అందించిన సేవలు మరువలేనివని కొనియాడారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

నల్లకుంట: నల్లకుంట సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో మంగళవారం నల్లకుంటలో పేదలకు దుప్పట్లు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు వి. పుల్లయ్య శంకరమఠం మార్కెట్ రోడ్డులో పేదలు, శంకరమఠం కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కార్యదర్శి మాచర్ల రంగయ్య, ప్రతినిధులు పి.నరసింగరావు, పి.సుభాష్‌చంద్రబోస్, డాక్టర్ మురళీధర్, చల్లా నర్సింహామూర్తి, లక్ష్మణ్‌సింగ్, కేశవరావు దేశ్‌పాండే, బంగారు రాజు, భవాని, రాములు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: తెలంగాణ రాష్ట్ర ఇంజినీరింగ్ డిపార్టుమెంట్స్ మెయింటనెన్స్ అండ్ ప్రాజెక్టు ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఈడీఎంపీఈఏ)–2025 డైరీ, కేలండర్‌ను మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అసోసియేషన్ జేఏసీ ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏలూరి శ్రీనివాస్ మాట్లాడుతూ... ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, నీటిపారుదల శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి పరిష్కరిస్తానన్నారు. పీఆర్సీ, డీఏ, ప్రమోషన్స్, పెండింగ్ బిల్స్‌పై గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఉద్యోగులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే..

చిక్కడపల్లి: ప్రజాపాలనలో సొంత ఇంటికోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను సేకరించేందుకు జీహెచ్ఎంసీ ప్రాపర్టీ ట్యాక్స్ అధికారులు మంగళవారం గాంధీనగర్‌లోని అరుంధతినగర్‌లో సర్వే నిర్వహించారు. దరఖాస్తుదారుల ఇంటికి వెళ్లి వారి ఆర్థిక పరిస్థితులు, అద్దె ఇల్లా లేక సొంత ఇల్లా.? తదితర వివరాలను సేకరించి ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేశారు. జీహెచ్ఎంసీ అధికారి విజయ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు 170 దరఖాస్తులను పరిశీలించామని తెలిపారు. అర్హులైన వారి వివరాలను ఉన్నత అధికారులకు అందజేస్తామని పేర్కొన్నారు.

ఘనంగా కాలేజ్ ఫెస్ట్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ప్రణాళికాబద్ధంగా విద్యను అభ్యసిస్తే ఉన్నత శిఖరాలు చేరుకుంటారని ప్రముఖ విద్యావేత్త, శ్రీఆకాష్ జూనియర్ కళాశాల ఫౌండర్ డైరెక్టర్ ఈశ్వరయ్య అన్నారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని వీఎస్‌టీ ఫంక్షన్‌హాల్‌లో శ్రీ ఆకాష్ జూనియర్ కళాశాల ఫెస్ట్ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్స్ సాయిరెడ్డి స్వప్న, శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ వంశీధర్‌రెడ్డి, వైస్‌ప్రిన్సిపల్ గోపాల్‌రెడ్డి, అధ్యాపకులు స్వప్న, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నియామకం

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: జాతీయ బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ మహిళా కన్వీనర్‌గా ఆర్.మంజువాణి నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఆమెకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహిళలు రాజకీయంగా ముందుకు వచ్చినప్పుడే సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. మంజువాణి మాట్లాడుతూ... తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించినందుకు ఆర్.కృష్ణయ్యతో పాటు పలువురికి కృతజ్ఞతలు తెలియజేశారు.

కేలండర్ ఆవిష్కరణ

కాచిగూడ: ఆర్‌కే కళా సాంస్కృతిక సంస్థ కళలు, కళాకారులను ప్రోత్సహించడం అభినందనీయమని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు.ఆర్‌కే కళా సాంస్కృతిక సంస్థ రూపొందించిన కేలండర్‌ను మంగళవారం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి బర్కత్‌పురలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శాస్త్రీయ కళారూపాలను ప్రోత్సహించడం భవిష్యత్ తరాలకు ఎంతో అవసరమని అన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను విశ్వవ్యాప్తం చేస్తున్న ఆర్‌కే కళా సంస్థ అధ్యక్షుడు డాక్టర్ రంజిత్‌ను అభినందించారు.

నగరంలో తస్కరించి.. జార్ఖండ్‌లో విక్రయం

• సెల్‌ఫోన్ చోరీ ముఠా సభ్యుల అరెస్ట్ • రూ.25లక్షల విలువ చేసే 58సెల్‌ఫోన్లు స్వాధీనం

ఖైరతాబాద్: పథకం ప్రకారం నగరంలో సెల్‌ఫోన్లను తస్కరించి జార్ఖండ్‌లో విక్రయిస్తున్న సెల్‌ఫోన్ ముఠా సభ్యులను ఖైరతాబాద్ పోలీసులు అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.25 లక్షల విలువ చేసే 58 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని నిందితులను రిమాండ్‌కు తరలించారు. మంగళవారం ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ ఏసీపీ సంజయ్‌కుమార్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. డిసెంబర్ 30వ తేదీ రాత్రి 11 గంటల ప్రాంతంలో చింతలబస్తీ ప్రేమ్‌నగర్ ప్రాంతంలో ఫోన్ మాట్లాడుకుంటూ వెళ్తున్న మహేందర్‌రెడ్డి వద్ద నుంచి ముగ్గురు వ్యక్తులు ఫోన్ లాక్కొని పారిపోవడంతో వారిని వెంబడించి ఆ తరువాత ఖైరతాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వెంటనే స్పందించిన ఇన్‌స్పెక్టర్ ఎస్.రాజశేఖర్, డీఐ సైదులు నేతృత్వంలో ఎస్ఐ ఆర్. నాగరాజు ఏరియాలో సెర్చ్ ఆపరేషన్ నిర్వహించి అనుమానంతో ముగ్గురిని తనిఖీలు చేయగా వారి గదిలో 58 ఫోన్లు గుర్తించి వెంటనే వారిని అదుపులోకి తీసుకున్నారు. దీపక్ కుమార్ (21), గోబింద్ కుమార్ (23), రాహుల్ నోయా (27) వీరంతా జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన వారు కాగా, వీరితో పాటు మరో ముగ్గురు ప్రేమ్‌నగర్‌లో గది అద్దెకు తీసుకొని నివాసముంటూ సెల్‌ఫోన్లు చోరీలకు పాల్పడుతున్నారు. వీరందరికి మాస్టర్ మైండ్ పింకు మెహతా (30) జార్ఖండ్‌లో వీరందర్ని ఎంపిక చేసి ఇక్కడికి తీసుకువచ్చి సెల్‌ఫోన్ చోరీలు చేయిస్తూ తిరిగి సెల్‌ఫోన్లను జార్ఖండ్‌కు తీసుకువెళ్లి అక్కడ సేల్ చేస్తుంటారు. డిసెంబర్ 24న మరో ఇద్దరితో కలిసి పింకు మెహతా జార్ఖండ్‌కు వెళ్లింది. వీరుకూడా మరో రెండు మూడు రోజుల్లో చోరీ చేసిన సెల్‌ఫోన్లతో జార్ఖండ్ వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇంతలోనే వీరు పోలీసులకు చిక్కారు.

◆ పోలీసులు స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లలో ఐ ఫోన్లు 6, వన్ ప్లస్ ఫోన్లు 9, ఓప్పో 9, శాంసంగ్ 9, రెడ్‌మి 7, వివో 8, మోటరోలా 3, ఐక్యూ 2, పికో 3, రియల్‌మీ 2 మొత్తంగా 58 ఫోన్లు ఉన్నాయి. ఖైరతాబా ద్, మెఘల్‌పురా, సైఫాబాద్, ఎస్ఆర్‌నగర్, చిక్కడపల్లి, మియాపూర్, మాదన్నపేట్ పో లీస్‌స్టేషన్ పరిధిలో చోరీ కేసులు నమోదైన ఫోన్లు రికవరీ అయినట్లు ఏసీపీ తెలిపారు. మిగతా వాటిని ఐఎంఈఐ నెంబర్ల ఆధారంగా బాధితులను గుర్తించి అందజేస్తామని తెలిపారు. ఈ మేరకు ముగ్గురు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఫిర్యాదు వచ్చిన వెంటనే స్పందించి నిందితులను పట్టుకున్నందుకు ఏసీపీ అభినందించారు.

అంబర్‌పేట నియోజకవర్గ అభివృద్ధికి కృషి



అంబర్‌పేట: నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. మంగళవారం బాగ్ అంబర్‌పేటలో రూ.55 లక్షల అంచనా వ్యయంతో వర్షపు నీరు నాలా అభివృద్ధి పనులను కార్పొరేటర్ బి.పద్మా వెంకట్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో వర్షపు నీటి సమస్య తలెత్తకుండా.ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని అన్నారు. ప్రతి వర్ష కాలం ప్రజలు వర్షపు నీటి ఇబ్బందుల పడకుండా కృషి చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో ఉన్న నాలాల అభివృద్ధిని పూర్తి స్థాయిలో చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జలమండలి డీజీఎం విష్ణువర్ధన్, ఏఈ రోహిత్, పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

చెత్త డబ్బాలను ఏర్పాటు చేసుకోవాలి



అంబర్‌పేటలో వ్యాపార సముదాయం ముందు చెత్త డబ్బాలను ఏర్పాటు చేయిస్తున్న డీఎంసీ

అంబర్‌పేట: వ్యాపార సముదాయాల ముందు చెత్త సేకరణ కోసం నిర్దిష్టమైన చెత్త డబ్బాలు వ్యాపారస్తులు ఏర్పాటు చేసుకోవాలని సర్కిల్–16 డీఎంసీ మారుతీ దివాకర్ తెలిపారు. మంగళవారం సర్కిల్ పరిధిలో ఏఎంహెచ్‌వో డాక్టర్ హేమాలతతో కలిసి వ్యాపారస్తులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ప్రతి వ్యాపార సంస్థ ముందు సుమారు 30 కిలోల సామార్థ్యం ఉన్న చెత్త డబ్బాలను విధిగా ఏర్పాటు చేయాలన్నారు. వ్యాపార సంస్థ ముందు చిన్న డబ్బా, పాత బకెట్‌లు, థర్మకోల్ డబ్బాలు వంటివి ఏర్పాటు చేస్తే అనుమతించమని తెలిపారు. నిర్దిష్ట కాలపరిమితిలో నిబంధనల ప్రకారం చెత్త డబ్బాలు ఏర్పాటు చేసుకోవాలని లేని పక్షంలో రూ.5వేల జరిమానా విధించడంతో పాటు జీహెచ్ఎంసీ చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. వ్యాపార సంస్థల ముందు చెత్త డబ్బాలు ఏర్పాటు చేసుకుంటే 70 శాతం రోడ్లపై చెత్త అదుపులోకి వస్తుందని తెలిపారు. చెత్త డబ్బాలు ఏర్పాటు చేసుకోని వ్యాపారస్తులు సహకారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

కార్పొరేట్ దోపిడీని అరికట్టాలి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: తెలంగాణ రాష్ట్రంలో ప్రైవేటు కార్పొరేట్ విద్యా వైద్య సంస్థల దోపిడీని అరికట్టాలని బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్ డిమాండ్ చేశారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో దండి వెంకట్ మాట్లాడుతూ... తమది ప్రజా ప్రభుత్వమని చెబుతున్న సీఎం రేవంత్‌రెడ్డి విద్యా, వైద్య దోపిడీని అరికట్టడానికి ఒక ప్రత్యేక చట్టం చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలలో ప్రభుత్వ విద్యా, వైద్యం, సామాన్యులకు అందుబాటులోకి తేవాలని కోరారు. ప్రైవేటు సంస్థలు ఆర్థికంగా దోపిడీ చేయడం వల్ల సామాన్య ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు నల్లా సూర్యప్రకాష్, ప్రధాన కార్యదర్శి సిద్దిరాములు, ఉపాధ్యక్షులు సబ్బని లత, ఎంఎం గౌడ్, శ్రీశైలం, వడ్ల సాయికృష్ణ, ఎల్లన్న, మారోజు సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



బీఎల్పీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న దండి వెంకట్

బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలి



సీపీఐ జాతీయ ప్రధానకార్యదర్శి డి.రాజాకు వినతి పత్రం అందజేస్తున్న గుజ్జ కృష్ణ

కాచిగూడ: పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్టసభలలో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘం ప్రతినిధులతో కలిసి సీపీఐ జాతీయ ప్రధానకార్యదర్శి డి.రాజాను మంగళవారం ఆయన వినతి పత్రం అందజేశారు. రిజర్వేషన్లు కల్పించే విధంగా కృషి చేయాలని డి.రాజాను కోరారు. కేంద్ర ప్రభుత్వం త్వరలో చేపట్టబోయే జనాభా గణనలో బీసీ కులగణన చేపట్టాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 52శాతానికి పెంచాలన్నారు. ఈ రిజర్వేషన్లకు రాజ్యాంగ భద్రత కల్పించే విధంగా చొరవ తీసుకోవాలని ఆయన కోరారు. కేంద్రంలో ప్రత్యేక బీసీ మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ నేతలు తంగెళ్ళ ముడి నందగోపాల్, ఉదయ్ నేత, రఘుపతి తదతరులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ బలోపేతానికి కృషి చేయండి

ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సంజీవరెడ్డి



డా.సంజీవరెడ్డిని అభినందిస్తున్న జలమండలి కార్మిక సంఘం నేతలు

కాచిగూడ: కార్మికుల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా నిరంతరం శ్రమిస్తున్న ఐఎన్‌టీయూసీ బలోపేతానికి కృషి చేయాలని ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జి.సంజీవరెడ్డి పిలుపునిచ్చారు. వీఎస్‌టీ గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో గెలుపొందిన జి.సంజీవరెడ్డిని మంగళవారం నారాయణగూడలోని ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో జలమండలి కంగర్ యూనియన్ అధ్యక్షుడు మొగుళ్ళ రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి సురేష్ బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ రామరాజు, అసోసియేట్ అధ్యక్షుడు భూమయ్య, ఐఎన్‌టీయూసీ నేతలు పూలమాలలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు.

◆ ఈ సందర్భంగా డా.సంజీవారెడ్డి మాట్లాడుతూ.. సరైన వేతనాలు, మెరుగైన పని పరిస్థితులు, సామాజిక న్యాయం అందించడానికి గతంలో కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను తీసుకువచ్చి అమలు చేసిందన్నారు. నేడు కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం అంబానీ, అదానీ వంటి కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా 44 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 కోడ్‌లను తీసుకువచ్చి కార్మికుల ప్రయోజనాలను దెబ్బతీసిందని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ బలమైన ఉద్యమాలు నిర్మించాలని పిలుపునిచ్చారు.

◆ మొగుళ్ళ రాజిరెడ్డి మాట్లాడుతూ... మోదీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలతో కార్మికుల జీవన స్థితిలో అంతరాయం కలుగుతుందన్నారు. విభిన్న రంగాలలోని కార్మికుల హక్కులు, సంక్షేమం, రక్షణకై ఐఎన్‌టీయూసీ అనేక పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. బీజేపీ కార్మిక వ్యతిరేక విధానాలను తీవ్రంగా ప్రతిఘటిస్తామని అన్నారు. భవిష్యత్‌లో బలమైన పోరాటాలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

తైక్వాండో పోటీల్లో సత్తాచాటిన అక్కాచెల్లెళ్లు



గోల్డ్ మెడల్, బ్రాంజ్ మెడల్స్‌తో సాధించిన అక్కాచెల్లెళ్లు వైభవి, సహస్ర

కాచిగూడ: హైదరాబాద్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన 7వ తెలంగాణ రాష్ట్రస్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్–2024 పోటీల్లో అక్కాచెల్లెళ్లు పాల్గొని గోల్డ్ మెడల్, బ్రాంజ్ మెడల్స్ సాధించారు. 4వ తరగతి విద్యార్థిని ఎస్.సహస్ర గోల్డ్‌మెడల్, ఇంటర్ సెకండ్ ఇయర్ విద్యార్థిని ఎస్.వైష్ణవి, 10వ తరగతి విద్యార్థిని ఎస్.వైభవిలు బ్రాంజ్ మెడల్స్ సాధించారు. మెడల్స్ సాధించిన ఒకే కుటుంబానికి చెందిన అక్కాచెల్లెళ్లను ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అభినందించారు. ఈ కార్యక్రమంలో తైక్వాండో మాస్టర్లు తుంగనూరి బాలరాజు గోపన్న, రాజు నాయక్, రాకేష్, అబ్దుల్ సత్తార్, ఎస్.సూర్యప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.



నూతన సంవత్సర శుభాకాంక్షలు

ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే ముఠా గోపాల్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. 2024 సంవత్సరంలో ఏ విధంగా అయితే ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో గడిపారో అదే ఉత్తేజం, ఉత్సాహాన్ని 2025 సంవత్సరంలో కూడా కొనసాగించాలని ఆకాంక్షించారు.

రైల్లో ప్రయాణికుడి బ్యాగ్ చోరీ

కాచిగూడ: రైల్లో ఓ ప్రయాణికుడి బ్యాగ్‌ను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. రైల్వే ఇన్స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని సత్యసాయి జిల్లాకు చెందిన వెంకట్‌నారాయణ తన భార్యతో కలిసి సెవెన్ హిల్స్ రైల్లో సికింద్రాబాద్‌కు వస్తోంది. సికింద్రాబాద్‌లో దిగాల్సిన వెంకట్‌నారాయణ కాచిగూడలోనే దిగాడు. రైల్లో బ్యాగ్‌ను మరిచి పోయాడు. దీంతో బాధితుడు మంగళవారం కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బ్యాగులో రూ.25వేల నగదు, ఒక రిస్ట్ వాచ్, ఒక సెల్‌ఫోన్ ఉందని తెలిపాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రైనేజీ పైపులైన్ నిర్మాణానికి నిధులు మంజూరు

ముషీరాబాద్: భోలక్‌పూర్ డివిజన్ సంధాని వీధిలో పదేళ్లుగా నెలకొన్న డ్రైనేజీ సమస్య పరిష్కారానికి రూ.10.50 లక్షల నిధులు మంజూరయ్యాయని కాంగ్రెస్ నేత మసూద్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం సంధాని వీధిలో కాంగ్రెస్ నాయకులు, జలమండలి మేనేజర్ కృష్ణమోహన్‌తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మసూద్ మాట్లాడుతూ.. రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్‌కు సంధాని వీధిలోని సమస్యను వివరించడంతో ఆయన తక్షణం స్పందించి రూ.10.50 లక్షల నిధులు మంజూరు చేశారని తెలిపారు. నిధులు మంజూరు కావడంతో త్వరలోనే డ్రైనేజీ నూతన పైపులైన్ నిర్మాణ పనులు జరుగనున్నాయని అన్నారు. పైపులైన్ పనులు పూర్తయిన వెంటనే రోడ్డు నిర్మాణం చేపడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నేతలు ఉస్మాన్, అబ్దుల్ కరీం, ఖైరత్ ఆలీ, ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

శబరిమలకు బైలెల్లిన అయ్యప్పమాలధారులు

ముషీరాబాద్: భోలక్‌పూర్ దేవునితోటలోని భవానీ శంకరాలయంలో మంగళవారం భోలక్‌పూర్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో పలువురు అయ్యప్పస్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 41 రోజుల పాటు దీక్ష చేసిన స్వాములు మంగళవారం ఆలయ ప్రాంగణంలో ఇరుముడి కట్టుకొని శబరిమలకు బయలుదేరారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజల్లో బీఆర్ఎస్ యువజన నేత ముఠా జైసింహ పాల్గొన్నారు. శబరిమలకు వెళ్తున్న అయ్యప్పస్వాములకు వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి శ్రావణ్‌కుమార్, వై.శ్రీనివాస్‌రావు, లలిత్‌కుమార్, ప్రతాప్, మహేష్, స్వామి, హర్షవర్ధన్, నగేష్, బీఆర్ఎస్ నేతలు శివముదిరాజ్, శంకర్‌గౌడ్, ప్రవీణ్, శంకర్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్‌లో 'నారాయణ' విద్యార్థులు ప్రతిభ

కాచిగూడ: నారాయణగూడలోని నారాయణ హైస్కూల్ విద్యార్థులు ఎన్ఎస్ఎస్ పోటీలో తమ ప్రతిభను చాటుకున్నారు. అంతరిక్షంలో జీవం, అంతరిక్షంలో కాలనీలు ఏర్పాటు చేసి భవిష్యత్ తరాల వారికి ఒక మాదిరిగా ఉండేలా అత్యద్భుతంగా ప్రాజెక్టులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంగళవారం నారాయణగూడలోని స్కూల్‌లో విద్యార్థులను ప్రశంసిస్తూ ఎన్ఎస్ఎస్ కిట్‌లను ప్రధానం చేశారు. వారికి కిట్‌లతో పాటు, డైరీ, టీషర్టులు, పెన్‌లను బహుమతిగా అందించారు. ఈ కార్యక్రమంలో నారాయణ స్కూల్స్ జీఎం గోపాల్‌రెడ్డి, ఏజీఎం బాల పరమేశ్వర్, కోఆర్డినేటర్లు ఆజాద్, నూర్, భవాని, ప్రిన్సిపాల్ హర్‌నీత్‌కౌర్, ఏవో రవీందర్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జి శోభన తదితరలు పాల్గొన్నారు.